

కిరాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-చింతపల్లి: కిరాణా వ్యాపారులు గుట్కా, ఖైనీలు, ఇతర మత్తు పదార్థాలను విక్రయించరాదని, కాలం చెల్లిన వస్తువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని చింతపల్లి ఎస్సై వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని వివిధ కిరాణా దుకాణాల్లో ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కాలం చెల్లిన వస్తువుల వినియోగంతో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతుంటారని, గుట్కా, మత్తు పదార్థాల వాడకం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువని వివరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రాణం తీసిన ఈత సరదా

చెరువులో మునిగి ఇద్దరు చిన్నారులు మృతి

పజాశక్తి-హుకుంపేట: ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలి తీసుకున్న విషాద సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గడి కించుమండ పంచాయితీ గడ్డిమర్రి గ్రామానికి చెందిన గెమ్మెలి డొంబ్రు కుమారుడు అఖిల్ (8), గెమ్మెలి సన్నుకరావు కుమారుడు సంతోష్ (8) ఇద్దరూ గడికించుమండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నారు. పాఠశాల ముగిసిన తర్వాత స్వగ్రామానికి వెళ్లి, పుస్తకాల బ్యాగులు ఇళ్ళలో వదిలారు. తల్లిదండ్రులు వ్యవసాయ పనుల వెళ్లారని తెలుసుకుని, తమతోటి స్నేహితులతో కలిసి పొలాలకు వెళ్లేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో ఉన్న చెరువులో ఈత కొడదామనే ఉద్దేశంతో నీటిలోకి దిగారు.అనుకోకుండా నీటి లోతు ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ మునిగి చనిపోయారు. స్నేహితులు భయంతో పరుగులు తీయడంతో పక్కనే వ్యవసాయ పనులు చేస్తున్న గ్రామస్తులు గమనించి వెంటనే రక్షణ చర్యలు ప్రారంభించారు. చాలాసేపు గాలింపు తర్వాత చిన్నారుల మృతదేహాలు వెలికితీయడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు. చిన్నారులు చెరువులో మునిగి మృతి చెందిన ఈ ఘటనతో గ్రామమంతా విషాదంలో మునిగిపోయింది.



ఇదే చెరువులో ఈతకు దిగిన చిన్నారులు





చిన్నారుల మృతదేహాలు

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

- సిపిఎం నేతల నిరసన



నిరసన చేపడుతున్న సిపిఎం నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి అరకులోయ రూరల్:కేంద్ర రాష్ట్ర తీసుకొచ్చిన విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం అరకులోయ మండలం సుంకరమెట్ట పంచాయితీ కేంద్రంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రామారావు, మండల నాయకులు, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, అదానికి దోచిపెట్టడానికి స్మార్ట్ మీటర్లు వేగంగా బిగించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. స్మార్ట్ మీటర్లతో లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.అందుకే సిపిఎం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.సెల్ఫోన్ రీఛార్జ్ చేస్తున్నట్టు విద్యుత్ మీటర్లలో కూడా సిమ్ కార్డులు పెట్టి రీఛార్జ్ చేయాలంటే ఆదివాసి గిరిజన ప్రాంతంలో సాధ్యం కాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించి, బిగిస్తే వాటిని పగలగొట్టాలని తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ప్రస్తుతం అధికారంలో వచ్చిన తర్వాత వైసిపి ప్రభుత్వం చేసిన ఒప్పందాన్ని కొనసాగిస్తూ స్మార్ట్ మీటర్లు బిగిస్తుందన్నారు. విద్యా, వైద్యం ,విద్యుత్, రైల్వే ,స్టీల్ ప్లాంట్, ఎల్ఐసి, ఎయిర్పోర్ట్, ఇతర అన్ని రకాల ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వారికి కట్టబెట్టాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వినియోగించినట్లయితే తీవ్రంగా మోసపోతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువత సంఖ్యలో పాల్గొన్నారు.

ఐటిఐ ప్రవేశాలకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రభుత్వ ఐటిఐలో రెండో విడత ప్రవేశాలకు ఆన్లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ రమణ తెలిపారు. దరఖాస్తు చేసిన అభ్యర్థులు తప్పనిసరిగా ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 1 గంటలోగా ప్రభుత్వ ఐటిఐలో సర్టిఫికెట్ల పరిశీలన (వెరిఫికేషన్) చేయించుకోవాలని ఆయన సూచించారు. పరిశీలన పూర్తయిన అభ్యర్థులు మెరిట్ లిస్టు ప్రకారం కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. కౌన్సిలింగ్ ఈ నెల 23న ఉదయం 10 గంటలకు చింతపల్లి ఐటిఐలో జరుగుతుందని వెల్లడించారు. మరిన్ని వివరాలకు ఫోన్:9885549944, 7780240104 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

దూరవిద్య ట్యూషన్, పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి -పాడేరు: ఆంధ్ర యూనివర్సిటీ దూర విద్యా కేంద్రం 2022- 2023 సంవత్సరం అడ్మిషన్ పొందిన ఫైనల్ ఇయర్ స్టూడెంట్స్ (ఇయర్ అండ్ బ్యాచ్)2024 సంవత్సరం అడ్మిషన్ పొందిన సెమిస్టర్ బ్యాచ్ ట్యూషన్ ఫీజు, పరీక్ష ఫీజును ఆన్లైన్లో చెల్లించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చిట్టబ్బాయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తృతీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు 3వ సెమిస్టర్ బిఏ బీకాం బీఎస్సీ విద్యార్థినీ విద్యార్థులకు మీ లాగిన్ లో అసైన్మెంట్స్ టాపిక్స్ ఇవ్వబడిందన్నారు.అసైన్మెంట్స్ ను ఇన్ టైంలో రాసి సబ్మిట్ చేయవలసిందిగా పేర్కొన్నారు. ఇతర వివరములకు ఫోన్: 9441415881 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భూముల రీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

-జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్



మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి -పాడేరు : ఈనెలాఖరు నాటికి భూముల రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ్ హెచ్చరించారు. రీసర్వే లో జాప్యం ఎందుకు చేస్తున్నారని విఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లపై ఆగ్రహం వ్యక్తం చేసారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి రెవెన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వారం రోజులుగా భూ సర్వేలో పురోగతి సాధించలేని విఆర్ఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. జలాశయాల పరిధిలో ఉన్న రైతులకు డిమాండ్ నోటీసు జారీ చేసి వారి నుండి నీటి పన్నులు వసూళ్ల చేయాలని ఆదేశించారు. ముంపు ప్రభావిత ప్రాంతాలలో పునరావాస ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గోదావరి, శబరి నదులు ప్రవాహాలు పరిశీలించి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, 22 మండలాల తహశీల్దారులు, డిప్యూటీ తహశీల్దారులు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల కొనసాగింపు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి సేంద్రియ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలు రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. కొద్ది రోజుల క్రితం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ విద్యా సంవత్సరానికి పాలిటెక్నిక్ ప్రవేశాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, గిరిజన సంఘాలతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు తీవ్రంగా విరుచుకుపడ్డారు. వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శెట్టి వినయ్ ఆధ్వర్యంలో చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వద్ద నిరసన నిర్వహించారు. ఎమ్మెల్యేలు విశ్వేశ్వర రాజు, శెట్టి వినయ్ లు సేంద్రియ పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలను రద్దు చేయడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాల ప్రధాన గేటు వద్ద రెండు గంటలపాటు జరిగిన ఆందోళన చేపట్టారు. వెంటనే వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెల్లారు. పాత ఉత్తర్వులను ఉపసంహరించి, ఈ విద్యా సంవత్సరంలో వెబ్ కౌన్సిలింగ్ ద్వారా యధావిధిగా దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత, జీకే వీధి మండల ఎంపీపీ బోయిన కుమారి, చింతపల్లి, జికె వీధి వైకాపా మండల అధ్యక్షులు పాంగి గణబాబు, కంకిపాటి గిరిబాబు, మాజీ మండల అధ్యక్షుడు మోరి రవి పాల్గొన్నారు.



లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుంటున్న దేవదాసు

పిఎం జన్‌మన్ గృహాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద పివిటిజలకు మంజూరు చేసిన గృహాలను జిల్లా విజిలెన్స్. మోనిటరింగ్ కమిటీ సభ్యులు వంతల .దేవదాసు పరిశీలించారు. మంగళవారం కోనాపురం పంచాయతీ పరిధి కితలంగి, కోనపురం, కరయిగుడ చుట్టుప్రక్కల గ్రామాల్లో సందర్శించారు. గృహాలు నిర్మిస్తున్న లబ్ధిదారులు పడుతున్న కష్టలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ, గృహాలు నాణ్యతగా కట్టుకోవాలన్నారు.దశలవారీగా పేమెంట్లు అందేవిధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. లబ్ధిదారులు ఇల్లు నిర్మాణంలో జాప్యం వహిస్తే సంబంధిత మండల స్థాయి అధికారులు పర్యవేక్షిస్తూ అనంతరం సలహాలు సూచనలు అందిస్తూ గృహాలు పూర్తి చేసేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల హౌసింగ్ ఏఈ నాగేశ్వరరావు, అనంతగిరి అరకు మండలాల బిజెపి నాయకులు రాజు, రామసందర్, వైసిపి నాయకులు రఘునాథ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సత్కారం

ప్రజాశక్తి- పెదబయలు:మండల కేంద్రం సీతగుంట సచివాలయంలో బదిలీ పై వెళ్తున్న సచివాలయం సిబ్బందిని మంగళవారం స్థానిక సర్పంచ్ పి మాధవరావు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిపిఎం మండల కార్యదర్శి సన్నిబాబు హాజరయ్యారు. వారి సేవలను కొనియాడారు. వైస్ సర్పంచ్ గంగాదరం పాల్గొన్నారు.



సన్మానిస్తున్న నాయకులు

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: క్రమశిక్షణతో కూడిన చదువు బంగారు భవిష్యత్తుకు దోహదపడుతుందని ఎస్సై కె పాపినాయుడు అన్నారు. మండలంలోని కిలోగుడ ప్రభుత్వ ఉన్నత, బాలుర ఆశ్రమ పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి, పొగాకు వంటి వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. పాఠశాల స్థాయిలో ఉన్నత చదువులకు తోడ్పాటు నిచ్చుకోవాలన్నారు. చదువుతోపాటు క్రీడలు శారీరక ఎదుగుదలను అందిపుచ్చుకోవచ్చన్నారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్,
- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, సమావేశంలో గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు



సదస్సుకి హాజరైన గిరిజనులు, నిర్వాసితులు

దేవీపట్నం - ప్రజాశక్తి : మండలంలో నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో కారం సోమరాజు, నడిపూడి వెంకటరెడ్డి అధ్యక్షతన మంటూరు ఆర్అండ్ఆర్ కాలనీలో మంగళవారం సదస్సు నిర్వహించారు. సదస్సుకి సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ దేవీపట్నం నిర్వాసితుల విషయంలో ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం వహిస్తోందని, కాఫర్ డ్యాంకట్టి ఎటువంటి పరిహారాలు పూర్తిగా ఇవ్వకుండా ఆయా గ్రామస్తులను ఇళ్లు ఖాళీ చేసే విధంగా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వ్యవహరించారని దేవీపట్నంలో నిర్వాసితులకు పూర్తి స్థాయిలో ప్యాకేజి, భూ నష్ట పరిహారం ఇప్పటివరకూ చెల్లించలేదన్నారు. సమస్యల పరిష్కారానికి నిర్వాసితులు సిపిఎం ఆధ్వర్యంలో చేసే ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ చట్టప్రకారం నిర్వాసితులకు అన్ని మౌలిక వసతులు కల్పించిన తరువాతనే గ్రామాలు ఖాళీ చేయించాలని దేవీపట్నం నిర్వాసితులకు మాత్రం ప్రభుత్వం ఏమీ కల్పించకుండా గోదాట్లో ముంచాలని చూస్తోందని విమర్శించారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం వారికి రావాల్సిన భూనష్ట పరిహారం, 18 సంవత్సరాలు నిండిన యువతకు ప్యాకేజి, పునరావాసం తక్షణమే కల్పించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల పోరాటాలకి గిరిజన సంఘం, సిపిఎం నిరంతరం మీకు అండగా ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 14 గ్రామాల నుంచి నిర్వాసితులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి తోడ్పడాలి



సమావేశంలో మాట్లాడుతున్న పిఒ

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం డివిజన్, చింతూరు డివిజన్‌లో ఉన్న మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తోడ్పాటు అందించాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహచలం పేర్కొన్నారు. మంగళవారం ఐటిడిఎ సమావేశ భవనంలో రంపచోడవరం డివిజన్, చింతూరు డివిజన్‌లకు సంబంధించి పలువురు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలోని మొత్తం 11 మండలాల్లో మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా జీవనోపాధి కల్పించాలన్నారు. ప్రతి మహిళా సంఘానికి బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేయించాలన్నారు. అన్ని మహిళా సంఘాలు వారి వారి ప్రగతి ఏ విధంగా ఉన్నదీ ఎప్పటికప్పుడు ఆయా మండలాలకు సంబంధించి ఎపిఎంలు, సిసిలు పర్యవేక్షించాలన్నారు. 11 మండలాల్లో వందన్ వికాస కేంద్రాలు అభివద్ధికి అంతా కృషి చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మహిళా సంఘాల సభ్యులతో శ్రీనిధి లోన్స్ కట్టించి వారి తోడ్పాటుకు కృషి చేయాలన్నారు. హెచ్‌డి జెండర్ ఏ విధంగా పనిచేస్తున్నదీ ఆయన ఆరా తీశారు. ఏజెన్సీలోని ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్ ద్వారా రైతుల అభివద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. 11 మండలాల్లో మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు ఎప్పటికప్పుడు చెల్లించే విధంగా మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని, రుణాలు చెల్లించిన మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయించాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఎపిడి దేగలయ్య, డిపిఎంలు అపర్ణ, పరమేశ్వరరావు, ఎపిఎంలు, సిసిలు, అకౌంటెంట్లు, ఎల్‌సిలు పాల్గొన్నారు.

జిఒ 3, గిరిజన చట్టాలపై రేపు అభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - రంపచోడవరం : జిఒ నంబర్ 3పై, గిరిజన చట్టాలపై గిరిజన సంఘాల నాయకులతో, ఎన్‌జిఒలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, న్యాయవాదులతో ఈ నెల 16న రాష్ట్రగిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌తో సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో మాట్లాడుతూ జిఒ నంబర్ 3, గిరిజన చట్టాలపై రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ యస్.భార్గవి గిరిజన సమస్యలపై బుధవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకూ గిరిజనుల అభిప్రాయలు సేకరించడం జరుగుతుందన్నారు. సమావేశానికి గిరిజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, న్యాయవాదులు, ఎన్‌జిఒలు పాల్గొని జిఒనంబర్ 3 గురించి, గిరిజన చట్టాల అమలు గురించి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిఒ ఒక ప్రకటనలో తెలిపారు.

సత్యసాయి కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న స్థానిక మహిళలు

ప్రజాశక్తి- దేవీపట్నం : తమకు వేతనాలు చెల్లించాలని రాజమండ్రి లాలాచెరువు ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ కార్యాలయం వద్ద 8 రోజుల నుంచి సత్యసాయి కార్మికులు సమ్మె చేస్తున్న విషయం విదితమే. వారికి మద్దతు తెలుపుతూ ఎపి ఆదివాసీ జెఎసి వైస్‌చైర్మన్ తెల్లం శేఖర్ మంగళవారం మాట్లాడుతూ సత్యసాయి డ్రింకింగ్ వాటర్ కార్మికులకు 19 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సత్యసాయి సంస్థ ద్వారా తాగునీరు అందిస్తోందని వారికి వేతనాలు చెల్లించకుండా మనోవేదనకు గురిచేయటం అన్యాయం అనారు. సత్యసాయి కార్మికులు సమ్మెలో ఉండడం వల్ల తమకు తాగునీరు అందడం లేదని తక్షణమే తమకు తాగునీరు అందించాలని ఎం.రావిలంక, ఇందుకూరుపేట పరిసర ప్రాంతాల్లోని మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి - చింతూరు : కల్లేరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామంలోని అంతర్గత రోడ్లు నిర్మాణం చేపట్టాలని కోరుతూ కల్లేరు సచివాలయం వద్ద మంగళవారం మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా చింతూరు మండల అధ్యక్షురాలు మడివి శ్రీదేవి మాట్లాడుతూ తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో కల్లేరు గ్రామంలోని మహిళలు బోర్లు మరమ్మతులకు గురయ్యాయని కలుషిత నీరు వస్తోందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించలేదని ప్రభుత్వం పైప్‌లైన్ ద్వారా అందించే నీరు ఆగిపోయిందని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కరించడం లేదని ఖాళీ బిందెలతో కల్లేరు సచివాలయం వద్దకు చేరుకుని సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. అధికారులు మాట్లాడుతూ తమ పరిధిలో ఉంటే పరిష్కరిస్తామని ఇతర సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మహిళా సంఘం మండల కమిటీ సభ్యురాలు సోడా చిన్నమ్మి, సోడే రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని ఆందోళన



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: జడ్డంగి చైతన్యనగర్ గ్రామంలో స్మశానవాటికకు స్థలం కేటాయించాలంటూ మంగళవారం గిరిజన సంఘం నేతలు తెడ్ల రాంబాబు, తెడ్ల అబ్బాయి ఆధ్వర్యంలో వందలాది మంది గిరిజనులు, మహిళలు ఆందోళన చేశారు. జడ్డంగి ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించి, ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జడ్డంగి సచివాలయం బయట గంటల తరబడి తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ నిరసన తెలిపారు. తెడ్ల రాంబాబు, తెడ్ల అబ్బాయి మాట్లాడుతూ. చైతన్య నగర్ కాలనీ ఏర్పాటై 4దశాబ్దాలు గడిచినా తమ ప్రాంతంలో స్మశాన వాటిక కేటాయించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన చట్టాలు, హక్కులు అధికారులు సక్రంగా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. స్మశానవాటిక ఏర్పాటు చేయాలని పలుమార్లు వినతులు ఇచ్చినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ అల్లు సత్యనారాయణ జడ్డంగి సచివాలం వద్దకు చేరుకుని గిరిజనులతో చర్చించారు. జడ్డంగి గ్రామ శివారు మదేరువాగు సమీపంలో స్థలం కేటాయించేందుకు ఉన్నతాధికా రులకు తెలియజేస్తానని సమస్య పరిష్కారం కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగితే జరిమానా

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం, పెద్దగద్దాడ, బొర్నగూడెం గ్రామాల్లో విద్యాసంస్థలకు వంద మీటర్ల లోపల ఉన్న పాన్‌షాపుల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న వారికి ఒక్కొక్కరికి రూ.200 చొప్పున ఏడుగురికి, బహిరంగంగా పొగ త్రాగుతున్న ఒక వ్యక్తికి రూ.200 జరిమానా విధించామని రంపచోడవరం సిఐ రవికుమార్ తెలిపారు. ఎస్సై భూషణం, ట్రైనింగ్ ఎస్సైలు నాగమణి, ఇందిరా, శ్రావణి హెచ్‌సి రమేష్ పాల్గొన్నారు.



షాపులు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఉపాధి హామీ ఇసిపై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఉపాధి వేతనదారులను, మేట్లను ఇబ్బందులకు గురి చేస్తున్న ఉపాధిహామీ ఇసిపై చర్యలు చేపట్టాలని రాజవొమ్మంగి పంచాయతీలోని ఉపాధిహామీ శ్రామికులు, మేట్లు మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధి శ్రామికులు, మేట్లు మాట్లాడుతూ శ్రామికులు 50 మంది పనిచేస్తే 30 మందికి మాత్రమే కూలి వేస్తున్నారు. మిగతా వారిని రిజెక్ట్ చేస్తున్నారని దీనివల్ల కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. 5 వారాలు పనిచేస్తే 3 వారాలు మాత్రమే డబ్బులు వస్తున్నాయని, మహిళా మేట్లపై ఇసి రాజబాబు ప్రవర్తన సక్రమంగా లేదని ఆరోపించారు. తనకు డబ్బులు ఇస్తేనే ఇస్తేనే మేట్‌కు చెక్ మెజర్మెంట్ చేస్తానని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇసి రాజబాబు పై 18 రోజుల క్రితం ఫిర్యాదు చేసినా నేటికీ అతనిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని అధికారులను ప్రశ్నించారు. తక్షణం అతనిపై చర్యలు తీసుకోవాలని లేకుంటే పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. ఎంపిపి గోము వెంకటలక్ష్మి మద్దతు తెలిపారు. ఎపిడి రాంబాబు ఉపాధి కూలీలు మేట్లతో చర్చించి సమస్య డ్వామా పిడి జిల్లా కలెక్టర్ ఐటిడిఏ పిఒలకు నివేదించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



నిరసన తెలుపుతున్న ఉపాధి హామీ శ్రామికులు, మేట్లు



మాట్లాడుతున్న డిఇ, జెఇ

ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి- చింతపల్లి: పల్లె ప్రగతి, పల్లె బాట కార్యక్రమం సందర్భంగా మండలంలోని పెదబరడ పంచాయతీ లోతుగెడ్డ జంక్షన్, కొత్తపాలెం పంచాయతీ కడశిల్ప గ్రామాల్లో జలవనరుల శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటించారు. ఈ పర్యటనలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు నీటిపారుదల శాఖ డీఈ కరుణ, జేఈ స్వర్ణలత పాల్గొన్నారు. అనంతరం గ్రామస్థులతో డీఈ కరుణ మాట్లాడుతూ, మండలంలో తాగునీటి సమస్యలు పరిష్కరించడానికి ప్రతి గ్రామాన్ని సందర్శిస్తూ పరిస్థితులను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. గతంలో జల జీవన్ మిషన్ ద్వారా మంజూరైన పథకాలు ఇంకా పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని త్వరితగతిన పూర్తిచేసి ప్రతి ఇంటికీ నాణ్యమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు బుజ్జిబాబు మాట్లాడుతూ, రాబోయే 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు, మౌలిక సదుపాయాలను అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సాగిన బాలకృష్ణ, జనసేన మండల ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, మండల కోఆర్డినేటర్ రాజుబాబు, సీనియర్ నాయకులు మఠం శ్రీనువాస్, కూడా రామకృష్ణ, మర్రి మనోహర్, వంతల రాజన్, పల్టసింగీ అనిల్, సతీష్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేస్తే సముచిత స్థానం

జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు టౌన్: పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే, టిడిపి పాడేరు ఇంచార్జీ గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని కుమ్మరిపుట్టులో మంగళవారం టిడిపి పాడేరు నియోజకవర్గం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఐదు మండలాలకు చెందిన టిడిపి జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రూపు రాజకీయాలతో పార్టీకి నష్టం జరుగుతుందని అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తనకున్న పరిపాలన అనుభవంతో రాష్ట్రాన్ని అనతి కాలంలోనే గాడిలో పెట్టినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొర్రా నాగరాజు, గోవింద్ మాస్టారు, పాండు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిడారి శ్రావణ్

అర్హులకు 'తల్లికి వందనం' అందించాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు: జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు తల్లికి వందనం పథకం అందించాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బడి బయట పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. గ్రామ సచివాలయాలు, ఐసిడిఎస్, వైద్యా ఆరోగ్య శాఖ, నైపుణ్యాభివృద్ధి, గృహ నిర్మాణాల శాఖల పురోగతి పై కలెక్టరేట్ నుండి మంగళవారం వీడికాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల్లికి వందనం మంజూరులో జాప్యం చేయ కూడదన్నారు. ఈనెల 16 నుండి ప్రత్యేక డ్రైవ్ పెట్టి ప్రతీ ఒక్కరికి ఆధార్ నమోదు చేయాలని చెప్పారు. ప్రతీ మూడవ శనివారం స్వచ్ఛాంధ్రా, స్వర్ణాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పర్యాటక ప్రాంతాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిల్స్ ను నిరోధించాలన్నారు. ప్రతీ గ్రామం, మండల కేంద్రాలలో ఫ్రై డే డ్రై డే నిర్వహించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ కాలుష్యంపై అందరికి అవగాహన కల్పించాలని స్పష్టం చేసారు. పీఎం జన్మన్ పథకంలో మంజూరు చేసిన అంగన్వాడీ భవన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ అందించాలన్నారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని చెప్పారు. ఎం. ఇ. ఓలు, సహాయ గిరిజన సంక్షేమాధికారులు ప్రతి రోజు రెండు పాఠశాలలను తనిఖీ చేయాలన్నారు. ఎం ఇ ఓలు ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి మార్గదర్శిని కార్యక్రమాన్ని అమలు చేయాలని చెప్పారు. పి ఎం జన్ మన్ పథకం లో మంజూరు చేసిన గృహ నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. 8 వేల గృహాలను ఇంకా గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి గ్రౌండింగ్ చేయాలని సూచించారు. పూర్తి చేసిన గృహాల నిధులు విడుదలవు తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, రంపచోడవరం ఐటిడి ఏ పిఓ కె.సింహచలం, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్.రజని, డి ఆర్ డి ఏ పిడి వి. మురళి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వరనాయుడు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి పి. ఎస్. కుమార్, ఎల్ డి ఎం మాతు నాయుడు, ఇఇ హౌసింగ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి- అనంతగిరి : మండల కేంద్రంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం మంగళవారం వైసిపి పార్టీ అధ్యక్షులు కొర్రా. సూర్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా అరకు శాసనసభ్యులు రేగం. మత్స్య లింగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి మోసాలను ప్రతి గడపకు చేర్చే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంను గ్రామస్థాయికి తీసుకెళ్లాలనాన్రు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చకపోగా ఏజెన్సీకి అదనంగా పవర్ ప్రాజెక్టులు, స్టార్ హోటల్ పేరిట గిరిజన చట్టాలను తుంగలోకి తొక్కి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. దీన్ని ప్రజలు గిరిజనులు ముక్తకంఠంతో తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

ఎంపీపీ శెట్టి. నీలవేణి మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం పై దిశ నిర్దేశం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పై పోరాటం చెయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో వైస్ ఎంపీపీ దూరు జయవర్ధిని, ప్రధాన కార్యదర్శిలు దోనేరు డేనియల్, గుజ్జలి మధుసూదన్ రావు, మాజీ జడ్పిటిసి దూరు గంగన్నదొర, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పాగి అప్పారావు, సర్పంచులు రాములమ్మ, పెంటమ్మ, అన్నపూర్ణాదేవి, అప్పలమ్మ, జన్ని సన్యాసిరావు పాల్గొన్నారు.

సమస్యలపై పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-పాడేరు : సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ పెడరేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర. ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం పెన్షనర్లు మంగళవారం ధర్నా. నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని వారు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు. ఆర్ నాగభూషణరాజు, శ్రీహరిరావు, జనరల్ సెక్రటరీ జి.మోహనరావు, ట్రెజరర్, గంగన్నపడల్, ముఖ్య సలహాదారులు కృష్ణ, సంయుక్తకార్యదర్శి రామకృష్ణ, త్రినాథరావు, వైస్ ప్రెసిడెంట్స్ రాంనాయుడు, సంయుక్త కార్యదర్శి పలసీ కృష్ణారావు, గంపరాయి. మోహనరావు, జిల్లాఉపాధ్యక్షులు సిహెచ్ ప్రసాదరావు, జిల్లా సయుక్త కార్యదర్శి రామాంజులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న పెన్షనర్లు

నేరాలు ఘోరాలు

వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు

పలువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - అనంతగిరి: అనంతగిరి ఘాట్ రోడ్డు లో మంగళవారం వేరువేరు చోట్ల రోడ్డు ప్రమాదాలు జరిగాయి, డమ్ముకు ఐదో నెంబర్ మలుపు వద్ద స్కూటీ బోల్తా పడి ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. వీరు అరకు మండలం నుండి విశాఖకు వెలుతున క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. అరకు మండలం పప్పుడువలస తగ్రామానికి చెందిన తండ్రి కొడుకులు వెంకటరావు. ప్రవీణ్‌లకు స్వల్ప గాయాలు తగిలాయి.

అలాగే మండల కేంద్రం గిరిజన సంఘం కార్యాలయం సమీపం మెయిన్ రోడ్‌లో కారు ,బైక్ ఢీకొన్న ఘటనలో అనంతగిరి ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ కూడా. భాస్కరరావు సోదరుడు వెంకటరావుకు గాయాలయ్యాయి. కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి అనంతగిరి నుండి భోజనం అనంతరం బైక్ మీద విధులకు వెళ్తుండగా అరకు నుండి ఎస్ కోటకు వెళ్తున్న కారు బలంగా ఢీకొటింది దీంతో తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, స్థానిక ఎస్సై శ్రీనివాస్, మండల జనసేన అధ్యక్షులు చిట్టెం మురళి వారిని ప్రథమ చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మెరుగైన వైద్యం కోసం ఎస్ కోట ఏరియా ఆసుపత్రికి వైద్యులు రిఫర్ చేసినట్లు తెలిసింది. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించవలసి ఉంది

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జోడుగుళ్ల జంక్షన్ వద్ద సోమవారం ఉదయం గుండెపోటుతో లారీ డ్రైవర్ హఠాన్మరణం పొందిన ఘటన చోటుచేసుకుంది. స్థానిక సిఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలివి. కష్ణా జిల్లా విజయవాడ జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీకి చెందిన కొల్లూరి రామ్మోహన్‌రావు (56) అనే లారీ డ్రైవర్ ఈనెల 13న పిడుగురాళ్ల నుండి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ లోడుతో కొత్తవలస వచ్చాడు. అక్కడ సగం సరుకును అన్‌లోడ్ చేసి, మిగతా వంద బస్తాలను జోడుగుళ్ల బొమ్మల కంపెనీలో ఆన్‌లోడ్ చేసేందుకు వచ్చాడు. ఉదయం 6:30గంటలకు అక్కడ ఎదురుగా ఉన్న హోటల్‌కు వెళ్లి టిఫిన్ అడగ్గా, తయారవ్వలేదని చెప్పడంతో ఎదురుగా ఉన్న స్తంభం దగ్గరికి వెళ్లి కూర్చున్నాడు. 10 నిమిషాల తర్వాత పక్కకు పడిపోవడంతో టిఫిన్ సెంటర్ యజమానితోపాటు మరికొంతమంది చూడగా అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించి, 108కి ఫోన్ చేసి రప్పించారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించి, అప్పటికే గుండెపోటుతో రామ్మోహనరావు మృతి చెందినట్లు నిర్ధారించారు కష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పొట్టివాడలో ఉన్న మృతుని కుమార్తె షేక్ బరకత్ ఉన్నిషాకు సమాచారం ఇచ్చారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంలో సంబంధిత అధికారులు తగిన చొరవ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్ డిమాండ్ చేశారు. జీతాలు చెల్లింపులో సంబంధిత అధికారులు చొరవ తీసుకోకపోవడంతో జీతాలు రావడానికి ఇంకా ఎంత సమయం పడుతుందోనన్న ఆందోళనలో ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. జూన్ 15వ తేదీ నాటికి బదిలీ ప్రక్రియ పూర్తయి, ఆయా స్థానాల్లో ఉపాధ్యాయులు చేరారని పేర్కొన్నారు. పొజిషన్ ఐడి సమస్యలున్న ఉపాధ్యాయులు మినహాయించి, క్లియర్ వేకెన్సీలో చేరి ఎల్‌పిసిలు సమర్పించిన ఉపాధ్యాయులకు జులై 6 నుంచి 10వ తేదీలోపు సప్లిమెంటరీ బిల్లులు పెట్టాల్సి ఉండగా సిఎంఎఫ్ సైట్ 10వ తేదీతోనే ఆపివేయడం వలన నిర్ణీత సమయంలో బిల్లులు సమర్పించని కారణంగా మరో నెల రోజులు పాటు జీతాలు అందని పరిస్థితి ఉపాధ్యాయులకు నెలకొందని తెలిపారు. ఎటువంటి సాంకేతిక సమస్యలు లేని ఉపాధ్యాయులకు బిల్లులు సకాలంలో పెట్టడంలో సంబంధిత అధికారులు వైఫల్యం చెందారని విమర్శించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జులై 16వ తేదీ నుంచి మరలా ప్రారంభం కానున్న సిఎంఎఫ్ సైట్లో సప్లిమెంటరీ బిల్లులు అప్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుని ఉపాధ్యాయులకు జీతాలు అందేందుకు సహకరించాలని డిమాండ్ చేశారు.

పిఎసిఎస్ చైర్మన్‌గా హరిబాబు



బూర్లె హరిబాబు

ప్రజాశక్తి- అడ్డతీగల : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) చైర్మన్‌గా బూర్లె హరిబాబును నియమించినట్లు టిడిపి కార్యాలయం నుంచి ఆదేశాలు రావడం జరిగింది. ఆయన ఇప్పటివరకు అరకు పార్లమెంటరీ నియోజకవర్గం సమన్వయ కమిటి సభ్యునిగా పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆయన కృషిని పార్టీ గుర్తించి ఈ పదవి ఇవ్వడం జరిగిందని పార్టీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు బిజెపి నాయకులు ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు. డైరెక్టర్లుగా గజ్జి వెంకటరమణ, కవడం చిన్నామ్మాయిని నియమించారు.



రేషన్ కోసం క్యూలో నిలబడిన గిరిజనులు

రేషన్..పరేషాన్

ప్రజాశక్తి - వై.రామవరం: తమ గ్రామాల్లో రేషన్ డిపోలు లేకపోవడం వల్ల రేషన్ కోసం అష్టకష్టాలు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 గ్రామాలకు, వైరామవరం డిపో వద్దే రేషన్ సరుకులు ఇవ్వడం వలన 10 గ్రామాలకు ఒక్క డిపో కావటం వలన 15వ తేదీ వచ్చినా ఇప్పటికీ బియ్యం అందడం లేదని వాపోతున్నారు. అసలే వర్షాకాలం వ్యవసాయ సీజన్ కావడంతో వ్యవసాయ పనుల్లో బిజీగా ఉండే రైతులు డిపోకు వచ్చి బియ్యం తీసుకుందామన్నా అందడం లేదని అధికారులు స్పందించి త్వరగా రేషన్ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

పక్షవాత బాధితునికి సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: మండలంలో సూరంపాలెం గ్రామానికి చెందిన పోలుపర్తి అప్పలనాయుడు ఏడాది కాలంగా పక్షవాతానికి గురై లేవలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యాడు. ఈ నేపథ్యంలో ఆయనకు సిఎం రిలీఫ్ ఫండ్ సుమారు రూ 34వేలు మంజూరైంది. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దరాజు ఆధ్వర్యంలో అప్పలనాయుడు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. దూసరపాము ఎంపిటిసి నల్లా సత్యనారాయణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ముప్పున డింభకేశ్వరరావు, టిడిపి నేతలు సత్తిబాబు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించండి

ప్రజాశక్తి -కూనవరం : ముల్లూరు పాఠశాలలో ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మేరకు విద్యాశాఖ అధికారికి వినతి పత్రాన్ని స్థానిక సర్పంచ్ బొగ్గా వెంకమ్మ పాఠశాల విద్యా కమిటి చైర్మన్ సోడె నాగేశ్వరావు ఆధ్వర్యంలో అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా పాఠశాలకు ఉపాధ్యాయుడు లేరని కాంట్రాక్టు టీచర్‌తో బోధన కొనసాగిస్తున్నామని ఇప్పటికైనా రెగ్యులర్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మేకల నాగేశ్వరావు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.


పలువురికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత సచివాలయం పరిధి దుర్గనగరంలో ఎబి కాలనీ ప్రైవేట్‌వైద్యులు డాక్టర్ జి.శేషగిరిరావు, సిహెచ్.నాగు ఆధ్వర్యంలో విశాఖపట్నం మెడికవర్, విజయనగరం పుష్పగిరి ఆసుపత్రి సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు జి భాగ్యరాజ్, గుండె వైద్యులు నిపుణులు శ్రావణ్‌కుమార్, కంటి వైద్య నిపుణులు ఎం.ఎస్ఎన్‌రాజు 100 మంది రోగులకు మంగళవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దుర్గనగరం,ఏబి కాలనీ,చికిలింత గ్రామాల నుండి 20 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి ప్రత్యేకబస్‌లో తరలించారు. కార్యక్రమంలో చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబు, గిరిజన సంఘం నేతలు పాండవుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

పడవ ప్రయాణికుల వద్ద అధిక వసూళ్లు



సర్పంచ్ హేమంత్‌కి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు నాగరాజు

ప్రజాశక్తి- కూనవరం: మేజర్ పంచాయితీ కూనవరం పడవ ప్రయాణికుల వద్ద అధికచార్జీలు వసూలు చేస్తున్నారని సిపిఎం సీనియర్ నాయకులు తలగాని నాగరాజు మండి పడ్డారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సర్పంచ్ హేమంత్‌కి అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పడవ పాటదారుడు ఎటువంటి నిబంధనలు పాటించకుండా అధికధరలు వసూలు చేస్తూ ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ప్రయాణికుల భద్రతపై ఎటువంటి బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని కనీసం లైఫ్‌జాకెట్లు లేకపోవడం అధిక సంఖ్యలో ప్రయాణికులను బోటుపైకి ఎక్కించడం అంటే ప్రమాదాలను ఆహ్వానించడంమే అన్నారు. తక్షణమే సంబంధిత అధికారుల పర్యవేక్షణలోనే రేవు బోటు నడపాలని డిమాండ్ చేసారు. సానుకూలంగా స్పందించిన సర్పంచ్ హేమంత్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల కమిటి సభ్యులు తాళ్లూరి శ్రీనివాసరావు, పట్టణ కమిటి కార్యదర్శి కొండా ఈశ్వర్లు, గడ్డిపాటి షణ్ముఖరావు, నోముల సత్యనారాయణ పాల్గొన్నారు

నేడు ఈమా లైమ్ లైట్ అవార్డుల వేడుక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగర నడిబొడ్డున ఈమా లైమ్ లైట్ అవార్డుల వేడుకను బుధవారం నిర్వహించనున్నట్టు వైజాగ్ ఈవెంట్ మేనేజర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్ కుమార్, షరీఫ్ ఖాన్‌లు సంయుక్తంగా తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎంవిపి.కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీచ్ రోడ్డులోగల గాదిరాజు ప్యాలెస్‌లో జరిగే ఈమా అవార్డుల వేడుకలో భాగంగా ఈవెంట్ రంగంలో ప్రతిభావంతులైన యాంకర్లు, సింగర్లు, డ్యాన్సర్లు, సౌండ్, లైటింగ్, ఎల్ఇడి టెక్నీషియన్లు, ఈవెంట్ ఇండస్ట్రీలో భారీ ప్రొడక్షన్లగల దిగ్గజాలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ముంబయి, కొల్‌కతా, బెంగళూరు, ఢిల్లీ తదితర నగరాల నుంచి సెలబ్రిటీ కళాకారులు ఈ ఈవెంట్‌లో ప్రదర్శన ఇచ్చేందుకు విశాఖకు వస్తున్నారని చెప్పారు. ఈ అవార్డుల వేడుకకు ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న కామాక్షి క్రాఫ్ట్స్ అధినేతలు వెంకటేష్, సిరి దంపతులు మాట్లాడుతూ విశాఖలో ఎంతో ప్రతిష్టాత్మకంగా, భారీ హంగులతో జరుగుతున్న ఈ ఈవెంట్ రాష్ట్రంలోనే ఒక ఐకాన్‌గా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ ఈవెంట్‌కు స్పాన్సర్‌గా వ్యవహరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మీడియా సమావేశంలో సినీ నటుడు సమీర్, గాదిరాజు ప్యాలెస్ జిఎం మధు, ఈమా కార్యవర్గ సభ్యులు కామేష్ పాలూరి, సురేష్ కుమార్, జిఎన్.రాజు, సంతోష్‌కుమార్, ఆనంద్ మోహన్, ఆశా పట్నాయక్, జగదీష్ జగదీష్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో సందీప్‌కుమార్, షరీఫ్ ఖాన్

ఘనంగా వరల్డ్ యూత్ స్కిల్స్ డే

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: మండలంలోని సున్నంవారిగూడెం ఆశ్రమ పాఠశాలలో వరల్డ్ యూత్ స్కిల్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం బొర్రా రమేష్ మాట్లాడుతూ 2014లో జులై 15న ఐక్యరాజ్యసమితి ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఐ టీ-ఐటీఈఎస్ వృత్తి విద్య ఉపాధ్యాయులు నాగబాబు మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే వృత్తివిద్య శిక్షణలో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన సాంస్కృతిక కార్యక్రమాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న యూత్‌స్కిల్స్‌డే వేడుకలు

పూర్వ విద్యార్థికి సన్మానం



అభిరామ్‌ని సన్మానిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - కూనవరం : స్థానిక విజయసాధన హైస్కూల్‌లో 2022-23కి సంబంధించి పూర్వ విద్యార్థి కారం అభిరామ్‌ని పాఠశాల సిబ్బంది సన్మానించారు. ఇంటర్‌లో 977 మార్కులు సాధించి ఐఐటి ఎన్ఐటి మణిపూర్ సీటు సాధించారని కరస్పాండెంట్ రజని తెలిపారు. అభిరాంని ఆదర్శంగా తీసుకుని పట్టుదలతో ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

గెలాక్సీ జెడ్ సిరీస్ ఆర్డర్లు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలోని అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, అధునాతనమైన గెలాక్సీ జెడ్‌సిరీస్, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7, గెలాక్సీ జెడ్ ఫ్లిప్ 7 కోసం ముందస్తు ఆర్డర్లు తీసుకోవడం ప్రారంభించినట్లు సంస్థ గెలాక్సీ శ్రేణి హెడ్ ఆదిత్య తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ, గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7 ఇప్పటివరకు గెలాక్సీ జెడ్ ఫోల్డ్ సిరీస్‌లో ఉన్న అతి సన్నని, తేలికైన అత్యుత్తమమైన గెలాక్సీ డిజైన్, కెమెరా కార్యాచరణ, ఎఐ ఆవిష్కరణలను కలిగి వుందన్నారు. ఇది అల్ట్రా-స్మార్ట్‌ఫోన్ యొక్క ప్రీమియం పనితీరు, అనుభవాన్ని అందిస్తుందన్నారు. అదే సమయంలో ఫోల్డ్ తెరిచినప్పుడు పెద్ద డిస్‌ప్లేతో నూతన స్థాయి సామర్థ్యం, ఉత్పాదకతను అందిస్తుందని చెప్పారు.

వినియోగదారులకు మరింత చేరువగా

స్కోడా సర్వీస్ సెంటర్లు

ప్రజాశక్తి - ఎంవిపికాలనీ: స్కోడా ఆటో ఇండియా సంస్థ దేశవ్యాప్తంగా 300 టచ్ పాయింట్లను చేరుకుందని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా తెలిపారు. నగరంలోని స్కోడా షోరూంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 172 నగరాల్లో 300 కస్టమర్ టచ్ పాయింట్లతో తమ సంస్థ కొత్త మైలురాయి అందుకుందని దేశంలో స్కోడా ఆటో నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా తమ సంస్థ వినియోగదారులకు చేరువయ్యేందుకు ఈ టచ్ పాయింట్లు ఉపయోగపడతాయన్నారు. ఇప్పటివరకు అన్ని కేంద్రాల్లో కలుపుకుని 5.50 లక్షల స్కోడా కార్లను సర్వీస్ చేసినట్టు ఆయన ప్రకటించారు.

నేటి నుంచి విశాఖలో

జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుని పర్యటన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్ విశాఖపట్టణం జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం సాయంత్రం 7.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి రోడ్డు ద్వారా నగరానికి చేరుకుంటారు. రాత్రి స్థానిక హెచ్‌పిసిఎల్ అతిథిగృహంలో బస చేస్తారు. గురువారం ఉదయం 11 గంటలకు మింది బిహెచ్ఇఎల్ ప్లాంట్‌ను సందర్శించి అధికారులతో సమావేశమవుతారు. ఆ రోజు సాయంత్రం అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీలతో కలిసి కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై సమావేశం నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హెచ్ పిసిఎల్ రిఫైనరీ ప్లాంట్ సందర్శించి అక్కడి అధికారులతో సమావేశమవుతారు. అదే రోజు సాయంత్రం 3 గంటలకు కలెక్టరేట్‌లో కలెక్టర్, సిపిలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. పిఎస్ క్రాంతికుమార్, డైరెక్టర్ డాక్టర్ సునీల్‌కుమార్‌బాబు, రీసెర్చ్ ఆఫీసర్ డి.వరప్రసాద్, పర్సనల్ అసిస్టెంట్ ఆఫ్ స్టేట్ ఆఫీస్, హైదరాబాద్ చొక్కాం నవీన్‌కుమార్ తదితరులు పర్యటించనున్నారు. అనంతరం 19వ తేదీ రాత్రి ఢిల్లీ చేరుకుంటారు.

19న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 19న డాటాప్రో, ద్వారకానగర్ క్యాంపస్‌లో ప్రత్యేక మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్లు రంగినేని సాయిప్రసాద్ సిద్ధవరపు ప్రసాద్ తెలిపారు. సోమవారం దీనికి సంబంధించి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నెలా మూడో శనివారం డాటాప్రో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల డాటాప్రో 35వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జాబ్‌మేళాలో ప్రముఖ ఐటి నాన్-ఐటీ కంపెనీలు పాల్గొనబోతున్నాయన్నారు. అనుభవజ్ఞులైన అభ్యర్థులకు అనేక ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.